

# పున్నామ నరకం

- మల్లాది సూరిబాబు

**"శివ శంకరంగారు సన్యసించారుట!
హరిద్వారం దగ్గర ఆశ్రమంలో ఉంటు న్నారుట."**

**ఈ వార్త వినగానే ఊరు వాడ మూక ఉమ్మడిగా విస్తుబోయారు. నిశ్చేష్టులయ్యారు. తీవ్ర 'దిగ్భ్రాంతిని' వెలిబుచ్చారు. ఈ వయస్సులో ఇటువంటి ఆలోచన కలిగినందుకు. పరాయి వాళ్లు కూడా జాలిపడ్డారు.**

జ్ఞానులు. యోగులు. ఒక్క క్షణం. అంతర్ముఖులై మౌనంగా కలి "మాయ" అని అనుకుంటే.

ముందు కాలంలో మంచి రోజులు వస్తాయి అని నమ్మకం ఉన్నవాళ్లంతా ఈ వార్త విని "ధర్మానికున్న నాలుగోపాదం కూడా పోయిందని కొందరంటే, మరికొందరు.

కలియుగం అంతమై మళ్లీ కృత యుగం ప్రారంభమైయింది అని సంతృప్తి పడ్డారు.

"ఉన్న ఒక్క మంచి కష్టమరు ఎందుకిల్లా అయ్యాడని' ' బార్ ప్రొప్రయిటరు బాలరాజు బాధపడుతూ వుంటే.

'సరస-సంగీత శృంగార రసికజన మనోభిరాముడు, మానినీ హృదయచోరుడు లేని ఎడారిగా యీ సీమ మారిందని నీలవేణి కుమిలి పోయింది.

"శ్రీరామ చంద్రుని సత్ సాంప్రదాయం.
కృష్ణ పరమాత్మ దక్షిణ నాయకత్వం
'నిత్య నూతనత్వం' - శాశ్విత యవ్వనం"
పెద్దల కన్నా పెద్దరికం - పసివారికన్నా పసితనం
ఇవన్నీ కలగలిపితే అదే శివశంకరం.

పెద్దలు ఇచ్చిన సిరిసంపదలు తరతరాలకు సరిపోయేవి వున్నా సోమరి పోతులాగా తిని కూర్చోక సగటు మనిషిలాగా తాను కూడా అహర్నిశలు శ్రమించి కష్టం సుఖం వంట పట్టించుకుని-

లక్షాధికారి కోటీశ్వరుడయ్యాడు. మంచి చదువు, చదువుకు తగ్గ ఉద్యోగం. ఉద్యోగానికి తగిన సంపాదన.

ఈ శివ శంకరానికి అన్ని విధాల యీడు జోడుగా వుండేది ఆయన ఇల్లాలు. శ్రీ దేవమ్మ. జన్మ జన్మల పుణ్యఫలంగా, వరప్రసాదంగా ఆవిడ వీరి హవేలీలో అడుగు పెట్టింది. అంద చందాలు సంగతి సరేసరి చెప్పనే అక్కరలేదు. జన్మతో వచ్చిన భూషణం, వినయం, స్వార్జితం - అంతులేని విద్యావైభవం.

ఆవిడ అడుగు పెట్టిన నాటి నుంచే కైలాసం లాంటి ఆ గృహం స్వర్గాన్ని మరిపించింది.

ఆ ముచ్చటలన్నీ ఒక్క పుష్కరమే.

ముగ్గురు కుమారులతో అత్రి మహాముని అనసూయలాగా ఆ దంపతులు అందరికీ ఆదర్శప్రాయంగా జీవన యాత్ర సాగిస్తున్న కాలంలో ఒకనాడు మబ్బులేని పిడుగు పడ్డది.

దసరాలలో - ఆలయంలో సివానీ పూజ జరిగి హారతి ఇస్తున్న సమయంలో.

ఆవిడ అందరి సమక్షంలో దైవ సన్నిధిలో అమరత్వాన్ని పొందింది.

ఎందుకిలా జరిగింది? అని ప్రశ్నిస్తే - దైవజ్ఞులకి, వైద్యులకి సమాధానం శూన్యం.

పూర్ణ ఆయుర్దాయమంటే ముప్పై ఆరు సంవత్సరాలేనా? లక్షల సంఖ్యలో అనుక్షణం జపించిన మహా మృత్యుంజయ మంత్ర ఫలితం ఇదేనా? అని ఆ

విదురుడు ఆక్రోశిస్తూ అడిగిన ప్రశ్నలు, యక్ష ప్రశ్నలు గానే మిగిలిపోయాయి.

క్షణకాలంలో ఆ సుందర భవనం, సతీదేవి లేని కైలాసంలా మారింది.

ఆ యింట్లో నలుగురు, తల్లిలేని బిడ్డలు...

పార్వతి లేని శివుడు.

వాక్కులేని అర్థం ఆ వాడలో నిలిచాయి...

నెల తిరగకుండానే రాబందులు వెంట పడ్డాయి. ఎవరి స్వార్థం వారిది.

పిల్ల నిస్తామని. ఆ యింటి గడప ఎందరో తొక్కారు. అనేక విధాల నచ్చచెప్పారు.

ఆయన అందరికి చెప్పిన సమాధానం ఒకటే. హరిశ్చంద్ర నాటకంలో పద్యం.

అరయున్ వంశము నిల్పనేగదా వివాహంబు-

చివరకు ఆయన మరదలు, భార్య చెల్లెలు మనస్సులోని మాట చెప్పింది.

"ఈ పిల్లలని రక్షించుకోవడం కోసమైనా నన్ను వివాహం చేసుకో" అని.

ఆయన క్షణకాలం ఏమీ మాట్లాడలేదు. ఆ చిన్నదాని ఆత్మీయతకు మనస్సు మూగబోయింది.

"నీ జీవితం చాలా విలువైయింది శారదా! దాన్ని శాపగ్రస్తం చేయవద్దు. మొదటి భార్య జ్ఞాపకాలతో సతమతమయ్యే భర్త నీ కడుపున పుట్టని సంతానం సంరక్షణ కోసం నీ సంతోషాన్ని సుఖాన్ని తెలివి తక్కువగా నాశనం చేసుకోవద్దు. ఎంత ప్రయత్నించినా పగిలిపోయిన అద్దంలా. ప్రతిబింబం సరిగ్గా ఉండదు" అని అన్నాడు.

మరి నీ జీవితం? నీ సుఖం?

"ఎన్నో జన్మలకి సరిపోయే అనుభూతులని మధుర స్మృతులను మీ అక్క వదిలి వెళ్లింది. ఈ జన్మకవి చాలు!" అని సమాధానం...

నడి వయస్సులో పాపం భార్య పోయి వంటరివాడు అయ్యాడన్న జాలికన్నా మా సలహా పాటించి మళ్లీ పెళ్లి చేసుకోలేదని అందరికి కోపం వచ్చింది. ముఖ్యంగా రెండో పెళ్లి వాడికి పిల్ల నివ్వడానికి సిద్ధమైన పెద్ద మనుష్యులకు.

ఆ పిల్లలకి అమ్మమ్మ అమ్మ తనే మమేకంగా ఉంటూ శ్రీ మహా యిల్లాలు - ఆ ముగ్గురు పిల్లల్ని పెంచి పెద్దవాళ్లని చేసింది.

శివ శంకరం గారు క్షణం తీరిక లేని వ్యాపకంలో పడ్డాడు.

ఉదయం నుంచి సాయంకాలం దాకా వ్యాపారం. చీకటి పడగానే సంగీతం, సాహిత్యం గొప్ప గొప్ప గాయకులు విద్వాంసులు, వారితో కాలక్షేపం. అందులో ముఖ్యంగా అన్నమాచార్య కీర్తనలు ఆధ్యాత్మిక రామాయణం గానం చేసే నీలవేణి బృందం అంటే ప్రత్యేక అభిమానం. వారిని ఏదో నెపంగా సత్కరిస్తూ వుండటం.

దీనిని పురస్కరించుకుని కొందరు ఆశ్రితులు చేసిన ఊహాగానాలకి ఆయన సమాధానం

"శ్రీదేవికి ఇష్టమైన పాటలు ఆవిడకి బాగా పాడగలదు!" పాత జ్ఞాపకాలు మనస్సుని మధనం చేస్తూ వుంటే జాగృతి నుంచి సుషుప్తికి, సులభ మార్గం, రెండు రౌండ్ల స్కాచ్ విస్కీ.

జీవితం పొద్దువాలిపోతోంది.

శ్రీదేవి లేదన్న చింత. మందులేని వ్యాధిగా మారితే. ప్రయోజకులైన కొడుకులని వాళ్లకుటుంబాలని గురించిన సంతోషం ఒక వెన్నెల రాత్రి. ఆనందంతో మనస్సుని తబ్బిబ్బులు చేస్తూ వుంటే.

గుండె కలుక్కుమన్నది. తను ఉన్నానని గుర్తు చేసింది !

టెలిగ్రాములు చూసుకుని. కొడుకులు కుటుంబాలు రెక్కలు కట్టుకుని వాలాయి.

**తాళ పత్రాలు**



**భీమయ్య:** మాక్కాబోయే అల్లుడితో పెద్ద చిక్కొచ్చిపడింది.

**శంకరం :** ఏం?

**భీమయ్య:** తాను పురావస్తుశాఖలో పని చేస్తున్నా కాబట్టి శుభలేఖలు తాళపత్రాలపై రాయించమంటున్నాడు

**శంకరం :** ???

**- కలపర్తి సత్యం (ఏలూరు)**

నలభై ఎనిమిది గంటలు. ఇహ పరాలకు మధ్యలో ఉన్న జీవుడు, ఇహానికి తిరిగి వచ్చాడు. చీకటిలో కన్ను కనిపించకపోయిన చెవులకి అన్ని మాటలు వినిపించాయి.

"ఈ ఆపరేషన్లకి స్పెషల్ ట్రీట్‌మెంట్లు అంటూ లక్షలు తగలేయ్యకండి. ముసలివాడు యింకా బ్రతికి సాధించవలసింది ఏముంది. లేని పోని సెంటిమెంట్లు పెట్టుకోకండి. మన పిల్లలకి చాలా డబ్బు అవసరం. వాళ్ల డబ్బు నాశనం చెయ్యకండి" అంటూ గృహలక్ష్మలు సలహా చెబుతున్నారు.

"ఈ మాసికాలు తద్దినాలు అపర కర్మలు ఇవన్నీ ఉత్త బూటకాలు. నాకు వీటిల్లో నమ్మకం లేదు. దహనం కూడా అనవసరం. బాడీని ఏ మెడికల్ కాలేజీకో దానం చేద్దాం. ఆయనకు కీర్తి దక్కుతుంది. మనకు అనవసరం ఖర్చు తగ్గుతుంది- అలా చేద్దాం." ఇది అందరికన్నా ఎక్కువ తెలివి తేటలున్న కుమారరత్నం నిర్ణయం. దానికి మిగతా కంఠాలు వంత పలికాయి.

శివశంకరంగారికి ఒక్క క్షణం శ్రీదేవమ్మ గారు గుర్తుకు వచ్చింది.

"వెన్నెల నీది. చీకటి నాది" అన్న ఆవిడతో అనాలనిపించింది. 'పాపి చిరాయువు' అని అనుకుని యమదూతలు తిరిగి వెళ్లిపోయారు.

"మీరు పూర్తిగా ఆరోగ్యవంతులయ్యారు." అని వైద్యులు చెప్పారు...

ఇంట్లో తను ఒక్కడు మిగిలాడు.

సాయంకాలం పూట. మామిడి చెట్టుక్రింద కూర్చున్నాడు. ఆ నిశ్శబ్ద వాతావరణంలో. మనస్సు క్షణకాలం అంతర్ముఖమైంది.

మామిడి చెట్టు బోధి వృక్షంగా మారింది.

ఈ బుద్ధుడికి జ్ఞానోదయం అయింది.

మనోపథంలో మూడు నగ్న సత్యాలు మెరిశాయి.

"తనకు అనారోగ్యం చేస్తే ఇహ వైద్య చికిత్స జరగదు.

తనకు ఉత్తర గతులు కలిపించి కొడుకులు పితృఋణం తీర్చుకోరు.

అజ్ఞానం వలన కాదు- కావాలని తెలిసి చేస్తున్న పాపాలు ఈ పున్నామనరకం నుంచి యీ దేవుడికి మోక్షం లేదు.

ఈ పాపం జరగకుండా వుండాలి. తన బిడ్డలు పాపులు కాకూడదు !!

ఏనాడో మనస్సులో దాక్కున్న మాట మసలింది.

సంసారి దుఃఖి ! సన్యాసి సుఖి !

సన్యాసికి యీ లంపటాలు లేవు. బాధలు బాధ్యతలు లేవు. ఎవరో ఏదో తనకు చేయలేదనే చింతలేదు. తనకు ఉత్తర క్రియ లేదు. అపర కర్మ లేదు. తుచ్ఛమైన యీ శరీరం అనేక జీవరాసులకి ఆహారం కావటం కన్నా తనకు కావలసింది ఏముంది!!

ఈ దురదృష్టవంతుడి కడుపున పుట్టినందుకు తన బిడ్డలు పాపులు కావలసిన అవసరం లేదు.

మనస్సు ఎంతో తేలిక అయింది. ఎవ్వరి మీద కోపం, ద్వేషం లేదు. ఎటు చూసినా ఆనందం, సంతృప్తి అందరూ తనవారే- పరాయి వారు ఎవ్వరూ లేరు.

ఒక్క క్షణం శ్రీదేవి మీద, కొడుకుల మీద కోపం వచ్చింది.

తన బ్రతుకు యీ తీరున కావడానికి కారణం వాళ్లని అనాలనిపించింది.

ఈ సంక్షోభం, ఈ సంఘర్షణ తనకు అక్కర్లేదు.

'ఎవరి కెవరు ఈ లోకంలో! అన్నీ ఎవరికి వారే అన్న జ్ఞానం ఉదయించింది.

అజ్ఞాన జ్యోతిలో ప్రయాణం. ఉత్తర దిశగా సాగింది.

శివశంకరుడు అస్తమించాడు!

స్వామీ శివానంద ఉద్భవించాడు!